# ఆట

వాడి వెనక వీడు – వీడి వెనక వాడు
గోతులు తవ్వుకుంటూనే ఉంటారు
గోతులున్నాయని వాడికి తెలుసు – వీడికీ తెలుసు
ఎవరికి వారు తెలియనట్టే నటిస్తారు
చీకట్లో కలుసుకోవటం – వెలుగులో చిందులేయటం
గోతుల్లో పడేయటం – గోరీలు కట్టటం
వారి ఆట!

ఆట వస్తువులుగా వారికి
గొర్రెల్లాంటి ప్రజలుంటారు
ఏ విలువాలేని వారి ప్రాణాలుంటాయి
మనుషుల్ని విడదీసే మతోన్మాదాలు
కులాలు కుమ్ములాటలు
ప్రాంతాలు ప్రాంతీయ భేదాలు
ఎన్నికల హాలాహలాలు
సంతాప సమరాలు
అగ్గిలాంటి ఆకలి, అరాచకం
నిప్పులాంటి నిరుద్యోగం, నిమిషానికొక మార్గమూ ఉంటుంది
ఏదో ఒక సాధనంతో ఆట కొనసాగుతూ ఉంటుంది
ప్రత్యక్ష వ్యాఖ్యానం అన్నింటా రసవత్తరంగా ప్రసారమవుతుంటుంది
వాయిదా పడుతుందేమోగాని
ఎవరో ఒకరు గోతిలో పడేవరకూ
ఆట మాత్రం ఆగిపోదు
గోతిలో పడ్డవాడు – పడేసిన వాడు
ఓటమి గెలుపులని ఒప్పుకోరు
అవాంఛిత పరిణామమనో – అనవసరంగా మోసపొయ్యామనో

అంతర్జాతీయకుట్ర అనో – ఆధిపత్యానికి అర్రులు చాచటమనో
కించిత్‌చింతించి – ఒకింత అదిలించి
ఒళ్లంతా దులుపుకుంటూనే
ఒంటికి కుట్టిన చీమల్ని నలుపుకుంటూనే
చీరుకు పోయినా
చీమూ నెత్తురూ రాని చర్మాన్ని సరిచేసుకుంటూనే
వాడో వీడో – మరొకడో మరొకడో
మరో దొంగాట కోసం
మళ్లీ మళ్లీ
మళ్లీ మళ్లీ . . . .